కమకట్టుకొన్నారు. ఈ సమావేశాల్లో ఒక ప్రముఖుడు తన ఉపన్యాసంలో "అక్కడివారికి బుద్ధి ఇక్కడివారికి సహనం" కావాలని చమత్కారంగా అన్నమాట యీ సందర్భంలో ఎంతైనా వర్తిస్తుంది.

కాబట్టి ఇన్ని చిక్కుల్లోఉన్న తెలంగాణా వారిని, ఫార్వర్డ్‌గా ఉన్నదనుకొంటున్న ఆంధ్ర ప్రాంతాన్ని, వెనుకబడ్డ ప్రదేశంగా గుర్తించబడ్డ దత్తమండలాల్ని ఏకంచేసి ఒకే ప్రభుత్వం క్రిందికి తీసుకొని రావడానికి కృషిచేసి, భాషాధారక పునాదిపై ఏదో స్వర్గతుల్యంగా మారుద్దామని కృషిచేద్దామనుకొంటున్న పంతులుగారి ధోరణి హుందాతనంగా కనిపించడం లేదు. (అయితే యీ విశాలాంధ్రవాంఛ అభిలాషణీయం గాదనికాదు ఇక్కడ చర్చ) మీదు మిక్కిలి వారు తమ ప్రసంగంలో కమ్యూనిస్టులదికూడా ఇదే నినాదం, వారుకూడావిశాలాంధ్ర స్థాపనకు కృషిచేస్తున్నారని నోరుజారారు. ఇదే కాకుండా వారు మహాసభాధ్యక్షుల కుండవలసిన స్థాయిని కాపాడుకోకుండా ఏదో సినిమా హాస్యగానిమాదిరి బాధ్యతారహితంగా ఉద్ఘాటించే ఉపన్యాసాలవల్ల ప్రజల్ని సమీకరించుకోలేరనీ, ఎప్పుడైతే వారు సామాన్యుల సందేహాలకు డొంకతిరుగుడు జవాబులతో కాకుండా ముక్కుసూటిగా సమాధానాలిచ్చి అపోహలని దూరం చేస్తారో అప్పుడే గమ్యంచేరడానికి ఆస్కారముంటుందనీ తెలుసుకోవాలి.

పై మూడు ఆంధ్రప్రాంతాల్ని ఏ ప్రాతిపదికపై ఏకంచేస్తారో సుస్పష్టం చేయకపోవడమే కాకండా ఎందుకు ఏకంకావాలో, న్యాయమైన యీకలయిక పరిణామమేమిటో, యీ మూడు ప్రాంతీయులమధ్య ఎలాంటి ఒడంబడికలవసరమో నిర్ణయించినట్లుతోచదు. నామమాత్రంగా ఆర్థిక స్వయంపోషకత్వందృష్ట్యా విశాలాంధ్ర స్థాపన అవసరమన్నంతమాత్రానా సామాన్యునికి తృప్తి కలుగదు. అసలే దుర్భరస్థితిలోనున్న తెలంగాణా వాసులు ఆంధ్రప్రాంతీయ గడబిడలుచూచి ఎందుకొచ్చిన విశాలాంధ్ర అని సుముఖత చూపించకపోయినా అబ్బురపడవలసిన అగత్యం ఉండదు. కాబట్టి ఇట్టి క్లిష్టపరిస్థితులదృష్ట్యా చక్కని ప్రజామన్నన బడసిన నాయకత్వంవైపుప్రజలు మొగ్గుతారుగాని, ఎండమావులని నీళ్లగా భ్రమిసేకాలం మారుతున్నదని గ్రహించుకోవాలి, ఇదే నేటి తెలంగాణాపరిస్థితి.

---

అపదలాదుకునే

# పరోక్షదైవాలు

అవసరాల రామకృష్ణారావు

చాలారోజుల క్రిందట-అప్పుడు మాఅన్నయ్యా వదినా బొంబాయిలో ఉండేవారు. మా అన్నయ్య బాగా చీకటి పడితేనేగాని యింటికొచ్చేవాడు కాడు. శీతాకాలం, ఆరింటికేబాగా చీకటి పడిపోయింది. ఓనాడు చీకటి పడేవేళకే మా వదిన వండేసి - ఏంతోచక 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ'లో బొమ్మలు చూస్తోంది. తలుపు చప్పుడయింది. మా అన్నయ్యేమోనని వదిన తలుపు తీసింది. తీరాచూస్తే ఎవరు? పెద్ద గడ్డమున్న బైరాగి! అతను యించుమించు యింట్లోకి జొరపడుతున్నాడు. పోనీ యింటివాళ్ళని కేకేద్దామంటే వాళ్లంతా తాళాలు వేసుకుని ఫస్టు షో సినిమాకి పోయారు. వాడేంచేస్తే ఏం దిక్కు? వదిన హడలిపోయింది. చేతిలో కమండలం—కాషాయివస్త్రాలూ, ఎర్రటి కళ్ళూ-ఏమీ ఇయ్యకపోతే ఏంచేసిపోతాడో అని ఎవరికి భయముండదూ? మా వదిన ధైర్యం తెచ్చుకొంది. అటు తిరిగి చాలా గట్టిగా"ఏమండోయ్ అత్తగారూ, మామగార్ని పెద్ద కర్రతీసుకుని యిలా రమ్మనండీ-ఇతనెవరో వెళ్ళడం లేదూ!"అని అరిచింది.

వైరాగి భయపడి కాస్త వెనక్కి వెళ్ళేడు. వదిన తలుపు వేసేసింది!

* * *

ఈసంగతి ఎందుకు ఉదహరించవలసి వచ్చిందంటే-అప్పుడు అత్తగారూ.మామగారూ ఎవరూ అక్కడలేరు! మేమంతా అప్పుడు విజయనగరంలో ఉండేవాళ్ళం! ఉన్నా, లేకపోయినా ఈ మాయదారి ప్రపంచంలో అవసరాల్ని దాటేందుకు, క్లిష్ట పరిస్థితులనుండి తప్పించుకోనేందుకు అనేకమంది పరోక్షదైవాన్ని స్మరించకతప్పదు!

* * *

కోమటిసెట్టి, పెద్దమ్మాయీ చిన్నమ్మాయీ కథ అందరికీ తెలిసిందే అనుకుంటాను. కుంచాలు లెక్కలు తెలిసిన ఎవరైనా పెద్దవాళ్లు వెడితే, "పెద్దమ్మాయీ పంతులుగారికి కుంచెడు బియ్యం కొలిచి యియ్యవే" అనేవాడుట. అప్పుడు సరి అయిన పెద్ద కుంచంతో బియ్యంవచ్చేవి. తెలిసీ తెలియనివాళ్ళు వెళ్ళి బియ్యం అడిగితే,

"చిన్నమ్మాయీ-కుంచం బియ్యం ఇయ్యవే" అంటే చిన్నదయిన పిచ్చకుంచంతో బియ్యం దక్కేవి. ఇందులో వినోదించవలసిన విషయం ఏమిటంటే కోమటిసెట్టికి పెద్దమ్మాయీ లేదు, చిన్నమ్మాయీ లేదు. అసలు పిల్లలేలేరు! కొట్టులో ఎప్పుడూ కనిపెట్టుకు ఉండేది సహధర్మచారిణి ఒక్కతే! ఆవిడే అనేక వేషాలు వేసేది!

* * *

"ఎంతో కాదు, పది రూపాయిలుంటే అప్పివ్వూ" అని నేనడిగేను మావాడ్ని. మావాడు ఎంతసేపో నొచ్చుకున్నాడు.

"అయ్యయ్యో, ఎంతపని జరిగింది!- నిన్నంటే నిన్న పాతికరూపాయలుంటే మా ఆవిడకు చీర కొన్నాను. ఈ సంగతి తెలుస్తే మాపెద్దదుగదా!" వాడిభార్యతో నేను మాట్లాడనని వాడికి తెలుసుగదా! అందుకని 'పరోక్షదైవం'గా ఆవిడని వాడుకున్నాడు. ఎవరికి తెలీదూ?

* * *

పొద్దుటలేస్తే మనం ఆడేవి పచ్చిఅబద్ధాలు. అవసరం కోసమే కానండా- అహంకారంకోసం, గొప్ప కోసం అనేకం కల్పిస్తాము. ఎదురింటిపిల్ల మాయింటికొచ్చి అడుగుతుంది.

"ఏమండీ, మా అమ్మగారిదగ్గిర నూరురూపాయిల నోటుందిటా, చిల్లరలేదుటా, మార్చిగానే పంపించేస్తుందిటా - ఒక్కరూపాయి ఉంటే యిమ్మంది" అనేకసార్లుయిచ్చి మా అమ్మకి ఒళ్లు మండిపోయింది - లేకపోతే డైరెక్టుగా అడగకూడదూ? ఇలా జవాబు చెప్పింది.

"వెయ్యిరూపాయిలదాకా రూపాయినోట్లు బీరవాలో ఉన్నాయిటా, కాని తాళం వాళ్ళ నాన్నగారిదగ్గిరుండిపోయిందిటా - ఆయన ఊరికెళ్ళేరుటా-వారంరోజులదాకా రారుటా- చాలా విచారిస్తున్నామని చెప్పమ్మా" ఆ పిల్ల మరిరాలేదు.

* * *

ఈ పరోక్షదైవాల్ని -సమయానికి సహాయం చేసే కల్పితస్వరూపాల్ని, అందరూ 'నేచురల్'గా వాడుకోలేరు. మా శారదతో ఒకావిడ అందిట. "ఈ ప్లాస్టిక్ చీరా? ఎక్కడ కొన్నానంటారా? మొన్న నేనండీ మా ఆయన వద్దంటున్నా ఫస్టుక్లాసు టిక్కట్టు కొనుక్కుని జనతాలో, కాకినాడ వెళ్ళి తెచ్చేరూ!" ఇందులో ఎన్ని అబద్ధాలున్నాయో గమనిస్తే నవ్వురాక తప్పదు.

* * *

నోరులేని ప్రాణులమీదో, చిన్న పిల్లలమీదో- కనపడని ఏ మనిషినో ఆసరాగా తీసుకునో- మనం తిట్టినా-అవసరం గడిపినా యీ రోజుల్లో అంత తప్పు అనిపించదు మరి!

